# జానపద నాటక వికాసం

వీధినాటకాలనీ, జానపద నాటకాలనీ, గ్రామీణ నాటకాలనీ, లోకధర్మి నాటకాలనీ వేరువేరు పేర్లతో ప్రచారంలో వున్న అన్ని ప్రక్రియలనూ ''దేశిరూపకాలు'' అన్న పేరుతో వ్యవహరించవచ్చు. నాగరికుల మార్గ నాటక విధానానికి భిన్నంగా, జానపదులకు అందుబాటులో వుండి, వారిని రంజింపచేయడానికి ప్రయుక్తం చేయబడే ముఖ్యమైన రూపక ప్రక్రియ దేశిరూపకం. మార్గరూపకాలు సంస్కృతభాషలో వ్రాయబడి విద్యావంతులైన ఉన్నతకుటుంబాల వారిని రంజింప చేయడమే దృష్టిలో వుంచకోవడం వల్ల, సామాన్య ప్రజలకోసం, వారి భాషలో వ్రాయబడి, వారి వినోదమే ధ్యేయం కలవి దేశిరూపకాలు. ప్రజాజీవితంలోని ప్రతి ప్రకియా ఈ రూపకాలకు ప్రాతిపదిక. వారి ఆచార వ్యవహారాలను ప్రస్ఫుటంగా ప్రతిబింబించే మనోరంజకమైన ప్రక్రియ యిది.

ఈ జానపదుల నాటకాల ఉత్పత్తి ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరిగిందో విస్పష్టంగా చెప్పడానికి మనకు ఆధారాలు లేవు. మానవుడు సహజంగా అనుకరణ శీలి. ఆ అనుకరణ వేషంలోను, భాషలోను చేయ సమకట్టిననాడే తొలి రూపక ప్రయోగానికి నాందీవాక్యం పలుకబడ్డదని చెప్పవచ్చు. ఆ ప్రాథమిక దశనుంచి దేశిరూపకాలుగా అవి వికాసం చెందినప్పటివరకు గల ప్రగతిని దశలవారిగా వివరించడం కష్టమే అయిన, ఈ రెండు దశల మధ్య దేశిరూపకం ఎన్నో ప్రయోగ దశలలో పరిణామం చెందిందని మాత్రం చెప్పవచ్చు.

ప్రపంచంలోని ఏ దేశానికి చెందిన నాటక చరిత్రను గమనించినా ప్రస్ఫుటం అయ్యే సత్యం ఒక్కటే. అన్ని దేశాలలోని రూపాకాల ఆవిర్భావానికి మతంతో ఎంతో కొంత సంబంధం ఉంది. ఆ మతాలకు సంబంధించిన ఊరేగింపులలో, ఉత్సవాలలో మానవుడు ఆనందంతో వేసిన చిందు మొదటి నృత్య విన్యాసం. రానురాను అది సంగీతాన్ని, సంభాషణలను కూర్చుకొని దేశిరూపకం అయింది.

మానవుడు తానుగా వేషం కట్టడానికి ముందు బొమ్మలతో ఆటలు ఆడించేవాడనీ, ఆ బొమ్మలాటలకు ప్రగతిరూపమే నాటకమనీ మనం నమ్మవచ్చు. అంతేగాక, ఈ పరిణామ చరిత్రను గమనిస్తే మరో విషయం కూడా విశదం అవుతుంది. ఈ నృత్యం మొదలైన తొలిరోజుల్లో పురాణ పఠనం, హరికథగానం, భాగవత కాలక్షేపం వంటి గానరూపంలో ఉండే కథాఖ్యానాలు బయలుదేరాయి. ఇట్టి కథాఖ్యానం రామాయణ కాలం నాటికే వున్నదనీ, కుశలవులు చేసిన రామాయణ గానం అట్టిదేనని చెప్పవచ్చు. ఈ కథాఖ్యానాలకు, ఉత్సవాలలోని నృత్యాలకు మత సంబంధమైన సామ్యం వుండడం వల్ల - కథాఖ్యానాలలో వుండే సంగీత సాహిత్యాలు, నృత్యాలలో వుండే నృత్యలయ విశేషాలు మిళితమై దేశి రూపకాలు ఆవిర్భవించాయని మనం ఊహించవచ్చు. ఇది ప్రాథమిక రూపం. బహుశః ఇది బహు పురాతన కాలంలోనే జరిగివుండవచ్చు. ఎందువల్లనంటే, క్రీ.పూ. 140కి చెందిన వాడని చెప్పబడుతున్న పతంజలి మూడు రకాలైన జన నాట్యాలను పేర్కొన్నాడు. ఇందులో మొదటిది శోభిక అనే మూకనృత్యం. రెండవది చైత్రిక, చిత్రించబడిన బొమ్మల ద్వారా ప్రదర్శింపబడేది. మూడవది గ్రంథిక. పుస్తకాలలో నుంచి చూచి పఠించేది. ఈ జననాట్య పద్ధతులను గమనిస్తే, దేశిరూపకాల ప్రాథమిక రూపానికి, పైవానికి జనక జన్య సంబంధం వున్నట్లు స్పష్టం అవుతుంది.

## దేశిరూపక వికాసంలో మూడు దశలు

వివిధ దేశాల నాటక చరిత్రను పరిశీలిస్తే నాటక పరిణామం - దేశి రూపకాలలో వలెనే మూడు దశల్లో సాగిందని చెప్పవచ్చు. అందులో ప్రాథమికదశ అని మనం చెప్పుకున్న ఏకపాత్రాభినయాత్మకం, పురాణ కాలక్షేపం మొదటి దశ కావచ్చు. దానికే రెండవదశ హరికథా కాలక్షేపం. దానికి విభిన్న రూపాలు జంగంకథ, జముకుల కథ ఇత్యాదులు.

గ్రీసుదేశంలో అంతకుముందు కేవలం బృందనృత్యంగా ఉన్నదశలో ''ఎస్కిలస్'' మొదట నటుణ్ణి, ''సోఫోక్లిస్'' ఇద్దరు నటుల్ని ప్రవేశపెట్టి నాటకత్వాన్ని పరిపూర్ణం చేశారంటారు. అలానే భారతదేశ రూపకాలలో కూడా ప్రథమదశ ఏకపాత్రాభి నయాత్మకం అని చెప్పుకోవచ్చు. ఇలా అనుకోడానికి మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. ఇప్పటికీ ప్రచారంలో వున్న కొన్ని దేశి రూపకాలు ఏక పాత్రాత్మకములే. హరికథను గూర్చి పురాణాఖ్యాలను గూర్చి ఇప్పుడే చెప్పబడ్డది. ఇవిగాక మహారాష్ట్రలోని ''బహురూపి'' అనే జననాట్యంలో ఒకే వ్యక్తి వేరువేరు వేషాలు ధరించి జనులను ఆనందపరుస్తాడు. కేరళ దేశానికి చెందిన ప్రబంధకుత్తు అనే దేశి నాట్యంలో ఒకే అభినేత కథకు వ్యాఖ్యచెబుతూ దానిని ప్రదర్శన రూపకంగా మాపులాడు.

ఇక రెండవదశలో ఇద్దరు పాత్రలు కల నాట్యాలు ప్రాముఖ్యంలోకి వచ్చాయి. వీనిని యుగ్మనాటకాలు అనవచ్చు. జంగంకథ, జముకులకథ - మొదలైనవి యీదశలో ప్రాథమిక రూపాలు. 10వ శతాబ్దానికి చెందిన ''త్రైవిక్రమ'' అనే జననాట్యం ఇద్దరు పాత్రలతో కూడినది. దానిలో సూత్రధారుడు వటే ఒక చిత్రపటాన్ని ఉంచుకుని దానిని గూర్చిన కథను అభివర్ణిస్తూంటారు. ''గ్రంథిక'' అనే జననాట్యంలో రెండుదళాలు వేరువేరు సంభాషణలు చదువుతూ అభినయం చేస్తారు. ''ఖ్యాల్'' లేక ''లావనీ'' అనే ఆఖ్యానాలు కూడా ఇట్టివే. ఇందులో ఇద్దరు వ్యక్తులు ఏదో ఒక విషయాన్ని ఆధారంగా తీసుకొని ఆశుకవిత్వం చెబుతారు. బెంగాలులో రెండు దళాలవారు పాల్గొనే ''కది'' అన్న జననాట్యం ఇట్టిదే. గొల్లకలాపంలో యిద్దరు పాత్రలే ప్రధానాలు. ఇవన్నీ రెండవదశకు చెందినవని చెప్పుకోవచ్చు.

ఇంక మూడవదశలో అంటే నేటి పరిణతదశలో చేర్చతగినవి సమూహ నాట్యాలు. వీనినే ''దేశి రూపకాలు'' అంటున్నాం. ఇవి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విశిష్ట రూపక ప్రక్రియగా మారి ఆ ప్రాంతానికి చెందిన కొన్ని ప్రత్యేకతలను సంతరించుకొని నేటికీ ఆయా ప్రాంత ప్రజలకి మనోల్లాస కారణం అవుతున్నాయి.

ఈవిధంగా పరిణామం చెందిన దేశిరూపకాల ప్రాచీనతని గురించి తగినన్ని ఆధారాలు లేవు. కాని క్రీ.పూ. నుంచి కూడా యిట్టి రూపకాలున్నాయని గమనించాం. భరతుని కాలంలో కూడా జననాట్యాలు ఉన్నాయని సంస్కృత సాహిత్య చారిత్రకర్త కృష్ణమాచారి గారి అభిప్రాయం.

సంగీత నాటకాలైన స్వాంగనాటకములను గూర్చి కాళిదాస విరచితమైన ''మాళవికాగ్నిమిత్రంలో'' చెప్పబడ్డది. ఈ స్వాంగ నాటకాలు క్రీ.పూ. రెండవ శతాబ్దం నుంచి ప్రదర్శింపబడుతున్నట్లు ప్రతీతి. నాల్గవ శతాబ్దంలో ''కీర్తనీయ'' అన్నపేరుతో ప్రచలితం అయిన అస్సాం వారి జననాట్యం, ''గోంధాళ్'' అన్న మహారాష్ట్ర నాట్యం, మార్వారీ దేశానికి చెందిన ''కుతు'' అనే నాట్యం వెయ్యి సంవత్సరాలకు పూర్వపునాటివని

చెప్పబడుతోంది. అంటే ఈ దేశిరూపకం దాదాపు రెండువేల సంవత్సరముల నుండి అవిచ్ఛిన్నంగా, గ్రామీణ ప్రజాజీవితంలో ఒక భాగస్వామి అయి వారికి మనోరంజనాన్ని కలిగిస్తున్న రూపకప్రక్రియ అన్నమాట.

ఈ రూపకం ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఎలా రూపొందింది, ఎలా ప్రత్యేకతను సంతరించుకున్నదీ పరిశీలించవలసి ఉన్నది. ఈ దేశి రూపకాలలో అన్నింటికీ వర్తించే కొన్ని సామాన్య లక్షణాలు ఉన్నాయి. వానిని గురించి తెలుసుకోడం ఆవశ్యకం.

మార్గరూపకాలకు భిన్నంగా ప్రజాసామాన్యానికి అందుబాటులో ఉండి వారిని రంజింజేయడానికి ప్రయుక్తం చేయబడే రూపకాలు దేశి రూపకాలని వెనుక చెప్పుకున్నాం. వీనికి, మతానికి మొదటవున్న సంబంధాన్ని కూడా చూశాం. ఈ మతసంబంధమైన ప్రాముఖ్యం దేశిరూపకాలలో ఇటీవలి వరకు నిలిచే ఉంది. భక్తిగాథలను ప్రజలకు అందించడానికి వివిధ సాహిత్యాంగాలు చేసిన కృషిలో అగ్రతాంబూలం దేశిరూపకాలకే!

అందువల్లనే రామలీల వంటి దేశిరూపక ప్రక్రియలు నేటికీ మతసంబంధములై వున్నాయి. అన్ని భాషల దేశిరూపకాలలోను ప్రాథమిక రూపంలో పౌరాణిక భక్తిగాథలే కథావస్తువులుగా వుండేవి. రానురాను ప్రజల మనోభావాలను వ్యక్తీకరించడానికి, సంఘంలో జరిగే కుళ్లను విమర్శించడానికిగాను యీ రూపకాల మధ్యలో హాస్యప్రసంగాలు, తరువాత సాంప్రదాయికమైన హాస్యపాత్రలు ప్రవేశపెట్టబడ్డాయి. ఈ పాత్రలు బొమ్మలాటనుంచి గ్రహించి ఉండవచ్చు. ఈ హాస్యపాత్రల ద్వారా ప్రజల మనోభావాలు వ్యక్తీకరింపబడడమే కాక వారి ఆచార వ్యవహారాలు కూడా ప్రదర్శింపబడేవి. కొంతకాలం తర్వాత ఈ హాస్యప్రసంగాలు మాత్రమే హాస్య ప్రహసనాలుగా ప్రదర్శింపబడడం కూడా దేశంలో అక్కడక్కడా ఆచారంలో ఉంది.

అందువల్ల యిటీవల ప్రచారంలో ఉన్న దేశి రూపకాలు స్థూలంగా రెండురకాలుగా ఉన్నాయని చెప్పుకోవచ్చు. అందులో ఒకరకం లఘుప్రహసనాలు. ఇవి కేవలం తాత్కాలికేతివృత్తం కలిగినవి. ఆయా ప్రజల వేషభాషలకి ఆచార వ్యవహారాలకు అనుగుణంగా సాగినవి. ఈ ప్రహసనాలు సాంఘిక విమర్శలోను, కొందరు కొందరు వ్యక్తులను అనుకరించడం ద్వారానూ, ఆయా ప్రాంతాల ప్రజలకు హాస్యాన్ని అందిస్తాయి. అందువల్ల ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కరకంగా వీనిరచన సాగుతుంది. సాధారణంగా సాంప్రదాయికంగా వచ్చే సంభాషణలు ఇందులో తక్కువ.

తత్కాలానికి ఆయా పాత్రలకు తోచిన సంభాషణలతో తోచిన వ్యక్తులను విమర్శించడం ఇందులో విశేషం.

ఇక రెండవ తరహా రూపకాలు నృత్యనాటకాలు. కథలు ధార్మికమైనవి. పౌరాణికములు లేదా ఐతిహాసికాలు అయిన ఇతివృత్తాలు కలిగి సంగీతం, నాట్యం ప్రధానంగా ఉన్న రూపకాలు. ఇవి దేశి రూపకాలలో పరాకాష్ఠకు చెందినవి. మొదట్లో అన్నీ నీతిదాయకాలుగా వుద్దేశింపబడినప్పటికీ రానురాను వానిని ప్రదర్శించడంలో కళాత్మకాలుగా ఉండడానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ వచ్చాయి. గ్రామీణప్రజలు దైవభక్తిపరులు గనుక యీ ధార్మిక నాటకాలు, ఎన్ని సంవత్సరాల తరబడి ప్రయుక్తం చేయబడుతున్నా వెనుకటి ఉత్సాహంతోనే ప్రజలు వానిని చూస్తూ ఉన్నారు.

## ఇతివృత్తం

దేశిరూపకాలలోని ఇతివృత్తాన్ని గురించి సూచనమాత్రంగా చెప్పుకున్నాం. ప్రహసనాలలోని కథ కేవలం ప్రాంతీయము, తాత్కాలికము. దాని ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రజలకు వినోదం కల్గించడం. ప్రజల అనుభూతులకు దగ్గరగా వచ్చే సాంఘికమైన విమర్శనలతో కూడి వారి మనసులను రంజింపచేసే ప్రక్రియ ఇది.

కథారూపకాలు ఐతిహాసికములుగాని, పౌరాణికములుగాని అయివుంటాయి. పౌరాణికాలలో కూడ చాలాభాగం కృష్ణభక్తిని ప్రదర్శించేవే। ఉత్తరదేశంలోని కొన్ని దేశిరూపకాలు కేవలం కృష్ణభక్తిని చూపేవి. మరికొన్ని కేవలం రాములవారి మహాత్మ్యాన్ని చాటేవి. అప్పుడప్పుడు జానపద నాయకుల, గొప్పభక్తుల కథలు కూడా వీనికి యితివృత్తాలు కావడం ఉన్నది. తరువాత తరువాత ముఖ్యంగా దక్షిణదేశంలో యీ దేశిరూపకాలు తాత్కాలికమైన ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని, ఒక మహారాజును గురించో, రాజ్యంలోని ముఖ్య సంఘటనను గురించో వ్రాయబడినవి కూడా ఉన్నాయి. అయినప్పటికీ యీ ఇతివృత్తాలలో చాలాభాగం భక్తిప్రధానాలు. మార్గరూపకాలలో ఉన్న జటిలత, సంక్లిష్టత యీ యితివృత్తాలలో ఎక్కడా కానరాదు. అసలు స్వీకరించే కథాభాగమే క్లుప్తమైనది. ఇతివృత్తం కన్న భక్తిభావం ముఖ్యం కనుక, కథాకథన చాతుర్యం కన్న, నాట్యం, తద్వారా సామాన్య ప్రజలను రంజింపజేయడం ముఖ్యం కనుక యీ యితివృత్తాలు సులభగ్రాహ్యాలుగా ఉంటాయి. ఈ ఇతివృత్తాలు భక్తిభావాన్ని ప్రదర్శిస్తూ, దేవతలకూ వారి విరోధులకూ అంటే మంచికీ చెడుకు జరిగే సంఘర్షణ చూపి, మంచికి విజయం కలుగుతుందని నిరూపించి, తద్వారా పల్లెపల్లెలా నీతిని గరిపి, శాంతిని స్థాపించి సాహిత్యానికి గల పరమప్రయోజనాన్ని అభివ్యక్తీకరిస్తాయి.

శృంగార ప్రధానాలైన దేశిరూపకాలు కూడా లేకపోలేదు. అందులో స్వాంగము, భవాయీ, గిద్దీ ముఖ్యమైనవి. భామాకలాపం గూడా అందులో ముఖ్యమైన భాగమే.

## పాత్రలు - పాత్రపోషణ

దేశిరూపకాలలోని పాత్రలలో పౌరాణిక ఐతిహాసికములైన పాత్రలను గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆ పాత్రలన్నీ సాధ్యమైనంత వరకూ, ఆయా పురాణాలలోను, ఇతిహాసాలలోను వర్ణించిన విధంగానే యీ నాటకాలలోను కన్పిస్తారు. కాగా వానిలోని సాంప్రదాయిక పాత్రలు, హాస్యపాత్రల విషయంలో రెండు ముఖ్యమైన విషయాలు చెప్పవలసి వుంది. వానిలోని సాంప్రదాయిక పాత్రలు గూడా యధాశక్తి హాస్యానికి దోహదం చేస్తాయి. నిజానికి మనకు అవి కొంచెం ఎబ్బెట్టుగా తోచినా, ఆ దేశిరూపకాలు ప్రజల ఆనందానికి, వినోదానికి ఉద్దేశింపబడవని జ్ఞాపకం ఉంచుకోవాలి. ఇక హాస్యపాత్రలు. వీనిలో సూత్రధారుడే వచ్చి నటీనటులతో సంభాషణలు జరుపుతూ మధ్యమధ్య హాస్యప్రసంగాలు చేస్తాడు. అతడుగాక కొన్ని రూపకాలలో కొన్ని నిర్ణీతమైన హాస్యపాత్రలుండడం చాలా సాధారణంగా కన్పిస్తుంది. తోలుబొమ్మలాటలలో వలెనే యీ పాత్రలుకూడా ఆ ప్రాంతానికి చెందిన ఏ పిసినారి వ్యాపారినో, దుష్టుడైన జమిందారునో విమర్శిస్తూ అనుకరిస్తూ హాస్యాన్ని పోషిస్తాయి. ఈ విదూషకుని పాత్ర రూపకం మొదలంటూ వస్తూ నాయికా నాయకులతో హాస్యప్రసంగాలు చేస్తూ వుంటాడు. అతడే ''మార్గ నాటకాల''లోనికి కూడా ఎక్కి ''విదూషకుడి''గా ప్రసిద్ధి పొందాడని కూడా ఒక వాదం ఉన్నది. సూక్ష్మములు, నిశితములు అయిన వ్యాఖ్యానాలు చేయడం దేశిరూపకాలలోని విదూషకుని

పనికాదు. అతని సంభాషణలు మనకు కొంచెం ఎబ్బెట్టుగా కొంతవరకు అసభ్యంగా తోచడం సహజం.

ఇక పాత్రపోషణను గురించి రెండు మాటలు. దీనిలో ఉత్తరదేశీయరూపకాలు, దక్షిణదేశీయ రూపకాలు భేదిస్తాయి. సాధారణంగా ఉత్తర దేశంలో ఆడంబరమైన వేషధారణ కన్పట్టదు. కాని దక్షిణదేశంలో ఆడంబరమైన వేషం ప్రధానం. ఇది ఒక్కటీ తప్పిస్తే అలంకరణలోమాత్రం అంతా సామాన్యమే. రంగురంగుల దుస్తులతోను ప్రతి శీర్షములతోను అలంకరించుకునేవారు. స్త్రీ పాత్రలను గూడా పురుషులే ధరించేవారు. దానికి అపవాదంగా ఒకటి రెండు దేశీయ రూపక ప్రక్రియలు వున్నా, ఇది సాధరణమైన లక్షణంగా చెప్పుకోవచ్చు.

పాత్రాభినయం చాలావరకు సాంప్రదాయిక మార్గంలోనే నడుస్తుంది. అయితే ఎంతో స్వతంత్రంగాను, సాఫీగాను మాత్రం ఉంటుంది. మార్గ నాటకాలలోని సూత్రాలకు కట్టుబడి చేయవలసినట్లు ఈ రూపకాలలోని నటన ఉండనక్కరలేదు. ఏపాత్రను అభినయించే నటుడు ఆపాత్రను అర్థం చేసుకుని ప్రజల దృష్టిలో ఆ పాత్రకున్న ప్రత్యేకతను గుర్తుంచుకొని నటిస్తాడు. అందువల్ల ప్రతి పాత్ర కూడా ప్రజల మన్ననలకు పాత్రం అవుతుంది.

## భాష – సంభాషణలు

జానపదలుకు మాత్రమే ఉద్దేశింపబడిన యీ దేశి రూపకాలలో వారికి సహజమైన తేలిక భాష మాత్రమే ప్రయుక్తం చేయబడుతుంది. అయితే యీ భాషను కూడా అలతి అలతి పదాలలో, పద్యాలలోను, పాటలలోను కూర్చడం వలన అది ఇంకా ఎక్కువ ఆకర్షవంతంగా వుంటుంది. ఈ దేశిరూపకాలలో గేయభాగం ఎక్కువగాను, గద్యభాగం తక్కువగాను వుంటుంది. విదూషకుల హాస్యాత్మక సంభాషణలు మాత్రం తప్పనిసరి గద్యంలో వుంటవి.

ఈ నృత్యగాన ప్రధానములైన రూపకాలు భాషాలాలిత్యానికి మారుపేర్లు. ఒక్కొక్కప్పుడు వీనిలో గద్య సంభాషణలు మాత్రం సాహిత్యపు విలువ ఏమాత్రం లేకుండా జుగుప్స జనింపచేసేవిగా కూడా వుంటాయి.

## సంగీతం

దేశిరూపకాలకు సంగీతం మూలం. వీనిని సంగీత నృత్య రూపకాలని పిలవటం కూడా కద్దు. ఈ సంగీతమంతా దేశిరాగములకు అనుగుణమైనదే. దేశి ఛందస్సులో ప్రయుక్తములయిన గేయములే స్వీకరింపబడ్డాయి.

ఇక వాద్యములు కూడ దేశ్యములే. డోలు, తాళముచిప్పలు, గజ్జెలు, మురళి - మొదలైనవి సాధారణ వాద్యములు. వీని ప్రయోగాన్ని గూర్చి దేశిరూపకముల ప్రయోగంలో పరిశీలిద్దాం.

ఇక్కడ ఒక్క విషయం మాత్రం చెప్పుకోవాలి. ఈ వాద్యాలన్నీ ఏ సమయానికి తగినట్లు అవి ప్రయోగింప బడేవి. భీకరమైన పాత్రల ప్రవేశ సమయంలో అందుకు తగినవి, నాయికా నాయకుల ప్రవేశ సమయంలో తదనుగుణమైనవి ప్రయోగింప బడతాయి. ఒక్క సూత్రధారుని లేదా విదూషకుని (హాస్యపాత్ర) గద్య సంభాషణల్కు తప్పిస్తే మిగిలిన అన్నివేళల వాద్యసంగీతమో, పదమో తప్పక ఉంటుంది. అందువల్ల నూటికి తొంబదిపాళ్లు సంగీత గీతికా నృత్యములు వుంటాయని చెప్పుకోవచ్చు.

## హాస్యం

దేశిరూపకాలకు హాస్యం కూడా ప్రధానమే. ఈ హాస్యాన్ని సృష్టించడానికి గల సాంప్రదాయిక హాస్యపాత్రలను

గురించి ముందుగానే పరిశీలించాము. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ప్రచారంలోవున్న లఘు ప్రహసనాల విషయం కూడ ప్రస్తావించాం. కాగా యీ హాస్యం కొంత కథాంతర్గతం, కొంత స్థానిక విషయాలపై విమర్శ. కథలో పట్టుతప్పినప్పుడో, కథ కొంచెం గంభీరంగా మారి ప్రేక్షకులకు విసుగు జనిస్తున్న సమయంలోనో యీ హాస్యపాత్రలు ప్రవేశించి, గ్రామస్థులకు లేదా ప్రేక్షకులకు కావలసినంత హాస్యాన్ని పంచిపెడతారు. ఒక్కొక్కప్పుడు కథకన్న హాస్యానిదే పైచేయి అన్నా అతిశయోక్తి కాదు. ఈ హాస్యపాత్రలు, విదూషకులు నాటకంలో ఏ భాగంలోనైనా ప్రవేశించడానికి అర్హులు. యే పాత్రనైనా పలుకరించే స్వేచ్ఛ కలవారు. తమ సంభాషణల వలననే గాక హావభావ చేష్టలవలన కూడా వారు ప్రజలను నవ్విస్తారు. కొన్ని రూపక ప్రక్రియలలో సూత్రధారులే హాస్యప్రసంగాలు చేయడం కూడా కన్పిస్తుంది. ఆ పాత్ర విదూషకుని పనిని, సూత్రధారుని పనిని కూడా చేయడం మనకు కన్పిస్తుంది.

## దేశిరూపకాల ప్రయోగం

దేశిరూపకాలను ప్రదర్శించడం ముందుముందు ''అమెచూర్''గానే జరిగినా రాను రాను ఏవో కొన్ని కులాలవారు లేదా కుటుంబాల వరు లేదా ప్రదేశాల వారు మాత్రమే ఒక్కొక్క ప్రక్రియను ప్రదర్శించాలనే నియమాలు వచ్చాయి. ఈ ప్రదర్శకులు ఊరూరా సంచారం చేస్తూ ప్రదర్శన లివ్వడం ప్రారంభించారు. అసలే గ్రామం. అందులో సంచార నటబృందం. ఈ రెండు కారణాల వల్ల రంగస్థల నిర్మాణం మీద, రంగాలంకరణ మీద, యీ ప్రయోక్తలు ఏమాత్రము శ్రద్ధ ఉంచినట్లు కానరాదు. పైగా గ్రామాలలో లెక్కకు మిక్కిలి ప్రేక్షకులు ప్రదర్శనను చూడడానికి రావడం కూడా యిట్టిదానికి అభ్యంతరం అయివుండవచ్చు. కాగా యీ జానపద నాటకాలను ప్రదర్శించడానికి ఎట్టి నియమితమైన రంగస్థలము, దానికి కావలసిన లేదా మార్గనాటకాలలో ప్రయోక్తం చేసే ఏ పరికరాలు కూడా లేకుండానే నాటక ప్రదర్శన జరుగుతుంది.

ఈ రూపకాల ప్రదర్శన రాత్రి 10 గంటలకు ప్రారంభించబడి తెల్లవారుఝాము వేళకు ముగుస్తుంది. ఒక్కొక్కప్పుడు నాటకం రెండు మూడు రాత్రులలో ప్రదర్శింప బడుతుంది. ఏ వూరి మొగనో, ఏ దేవాలయం ముంగిటనో రెండు స్తంభాలు, దానికి రెండు ప్రక్కలా కాగడాల దీపాలు, లేదా ప్రమిదలతో దీపాలు, కళ్లాపుచల్లి రంగస్థలం ఏర్పాటు చేస్తారు. పందిరి ఉంటే మంచిది. లేకున్నా ఇబ్బంది లేదు. కనుచూపుమేరకు అందేవరకు ప్రేక్షకుల గాలరీ. అటొకడు, ఇటొకడు తెల్లనిబట్టను పట్టుకుంటారు. అది తెర. అదికూడ మొదటి నటీనటులు ప్రవేశించేవరకే. ఆ తరువాత అంకాలు, రంగాలు అన్నీ కూడా నటులు ఆ రంగస్థలం నుంచి వైదొలగినంతనే పూర్తి అయ్యాయని భావించుకోవాలి. తెరవెనుక హంగుదారులు, వాద్యగాండ్రు వుంటారు. ప్రతిపాత్ర తన ప్రవేశానికి ముందు తన చరిత్ర తాను చెప్పుకుని ప్రవేశించడం కొన్ని యెడల ఆచారం.

పై విషయాలను గమనిస్తే, గ్రామీణ ప్రజల వలెనే, వారికోసం ప్రదర్శింపబడే యీ రూపకాలుకూడా ఎక్కువ ఆడంబరాలు లేక సామాన్య ప్రజలలో భక్తి ప్రవత్తులను కలిగిస్తూ, తద్వారా వారి మనస్సులకు ఉల్లాసాన్ని కలిగించడంలో నిరంతరం కృషిచేస్తూ ఎంతో కృతకృత్యులయ్యాయని చెప్పుకోవాలి.

కొన్నియెడల వానికి సాహిత్య గౌరవం లభింపక పోవచ్చు. కాని ప్రజలకు అవికూర్చిన ఆనందం ఏ సాహిత్య రూపకాలు కూడా చూపలేవనడం అతిశయోక్తి గాదు.